# పాప

అరగంట నుంచి ఒక్కత్తే కూచుంది పాప పార్కులో. తన స్నేహితుడు రంగారావును అక్కడ కలుసుకోమంది. అతనింకా రాలేదు. పాపకు విసుగెత్తుతుంది. ఎంత సేపని ఎదురు చూడడం! పాపకు కోపం వస్తోంది. ఏడుపువస్తోంది. అతనితో సరదాగా కబుర్లు చెప్పుకోవాలను కుంది. పార్కంతా తిరగాలనుకుంది. అందుకే ఐదు గంటలకే రమ్మంది. తాను నాలుగున్నరకే వచ్చి కూచుంది. ఏడీ ? అంతులేదు.

పాప అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు సరిగా! పుట్టినప్పటి నుంచి అమ్మా నాన్నా అలానే పిలుస్తున్నారు. అంచేత అందరూ అలానే పిలుస్తున్నారు. ఒక్కతే కూతురు. అంచేత ఆడింది ఆటా పాడింది పాటగా ఉంది. దీనికి ఎవరూ అడ్డు చెప్పేవాళ్లు లేరు.

తండ్రికి పెద్ద బజారులో నాలుగు షాపులున్నాయి. అందులో బిజి నెస్ ఎలా వుందో లాభం వస్తుందో నష్టం వస్తుందో పాపకు తెలియదు. పాపకు తెలిసిందల్లా ఇంట్లో నలుగురు నౌకర్లు ఉన్నారు. రెండు కార్లు ఉన్నాయి. ఏమూల ఎవరున్నారో కూడా తెలియనంత పెద్ద బంగళా ఉంది. ముద్దుగా చూసుకునే తల్లి ఉంది. అడిగింది అరనిమిషమైనా ఆలస్యం రాకుండా తెచ్చి ఇచ్చే తండ్రి ఉన్నాడు.

అందుకే పాపకు గారాబం, పెంకెతనం ఎక్కువయ్యాయి. బల్లి మీద పాలు పెడితే విసిరికొట్టి పళ్ళ రసం కావాలంటుంది. పళ్ళ రసం పెడితే పారబోసి ఇంకేవో తెమ్మంటుంది. అలా సాగుతోంది జీవితం.

పదహారు నిండి పదిహేడు వస్తానంటోంది వయస్సు పాపకు కావలసినంతమంది టీచర్లు ఉన్నారు, ఊరికే జీతాలు పుచ్చుకుంటూ! ఆ పిల్లకు చదువుమీద శ్రద్ధ లేదు. గట్టిగా చదువుకోకపోతే ఎలా అని అమ్మా నాన్నా ఎప్పుడూ చెప్పలేదు. వాళ్ళ ధ్యాస అంతా తమ అంతస్తుకు తగ్గ అల్లుడు ఎక్కడ దొరుకుతాడా అన్న ఆలోచనలోనే ఉంది.

పాపకు మూడో ఇంట్లో ఉంటాడు రంగారావు. కలెక్టరాఫీసులో టైపిస్టు. తండ్రి లేడు, తల్లి ఉంది. ఒక పెళ్ళైన చెల్లెలు, ఇంకొక పెళ్ళి కాని చెల్లెలు ఉన్నారు. ఎప్పుడో కట్టిన పెంకుటిల్లు ఉంది. సంసారం సాగుతోంది.

పాపకు రోజూ తనకు ప్రియమైన టామీని పార్కుదాకా షికారు తీసుకు వెళ్ళటం అలవాటు. అది పార్కులో ఆడుకుంటూ ఉంటే, పాప సంతోషంగా దానితో ఆడుతూ ఉంటుంది. అలా ఎప్పుడో ఆ పార్కులోనే రంగారావుతో పరిచయమైంది. అతను పాపకు నచ్చాడు. కాలక్షేపానికి బాగున్నాడనుకుంది. అమ్మా నాన్నకు చెప్పవలసిన అవసరం తోచలేదు. తరచుగా పార్కులో కలుసుకుని కబుర్లు చెప్పుకోటం. అదీ చాటుగా అను కోటం ఒక సరదాగా ఉంది. జీవితంలో ఆడుకోటానికి మరొక ఆటవస్తువు దొరికినట్లుంది.

కాని ఇవ్వాళ రంగారావు రాలేదు. టామీ పార్కంతా తిరిగి పొద్దు గూకుతూ ఉంటే పాప దగ్గరకు వచ్చింది. పాపకు దానితో ఆడుకోవాలని పించలేదు. కళ్ళ వెంబడి నీళ్లు వస్తున్నాయి. ఉదాసీనంగా బెంచీ మీద కూర్చుంది. చీకటి పడుతోంది. ఇంక ఇంటికి పోవాలి. జనం తగ్గి పోతున్నారు. ఇంక పోక తప్పదు. రేపు కానీ రంగారావును ఏం చేస్తానో! నాలుగు దులుపుతాను. ఏమనుకుంటున్నాడు! తానొక మహారాజును కుంటున్నాడా? తన అంతస్తుకు తగినవాడు కాకపోయినా, తను స్నేహంగా

మాట్లాడుతోందే! ఇంట్లో అమ్మా నాన్నా కూడా తనకెప్పుడూ ఏమీ కాదనరే! ఇతనేమిటి తనంటే ఇంత నిర్లక్ష్యం! ఇంక ఇతని ముఖం చూడకూడదు. కళ్ళ వెంట నీళ్లు బొటబొటా కారుతున్నాయి. పాపం టామీ కూడా బెంగగా కూచుంది.

అప్పుడు చూసింది పాప. పక్క బెంచి మీద ఒకావిడ చిరిగిన చీర ముసుగు కప్పుకుని కూచుంది. ఇందాకటి నుంచి అక్కడే ఉంది. తను గమనించలేదు. ఇందాకటి నుంచి ఆవిడ శిలాప్రతిమలా అలా కూచునే ఉంది. కదల్లేదు మెదల్లేదు.

పాపకు ఆవిడతో మాట్లాడాలనిపించింది. "ఎవరి కోసం చూస్తున్నావ్" అంది. ఆవిడ కాస్సేపు నిర్లిప్తంగా చూసింది. తర్వాత మెల్లగా అంది-" ఎవరి కోసమూ లేదు" అని. పాపకు ఆశ్చర్యం వేసింది. "ఇంటికి పోవా ?" అంది. ఆవిడ మళ్ళా కాస్సేపు మాట్లాడలేదు. "ఇదే ఇల్లు" అంది. పాప మళ్ళా తెల్లబోయింది. పార్కు ఇల్లంటుందేమిటి! "నీకు సొంత ఇల్లు వేరే లేదా ? ఇక్కడ చలివెయ్యదూ ? రాత్రికి ఇక్కడే ఉంటావా ?" అంది. ఆవిడ మెల్లగా చెప్పింది "ఉంటే ఉంటాను, పోతే పోతాను ఇంట్లోనూ చలివేస్తుంది" అంది.

పాప మళ్ళా తెల్లబోయింది. "ఇంట్లో ఎందుకు చలివేస్తుంది ? కప్పుకోను దుప్పట్లు లేవా ?" అంది. ఆవిడ మళ్ళా చెప్పింది. "ఊఁ చినిగిన చీర తప్ప ఇంకేమీ లేవు. ఇంటికి మట్టి గోడలు ఉన్నాయి. పైన కప్పు లేదు. ఎప్పుడో గాలివానకు పాక కూలింది. మళ్ళా వేసుకోలేదు" అంది.

పాపకు జాలివేసింది. "అమ్మా నాన్నా లేరా ?" అంది "లేరు చిన్నప్పుడే పోయారు" అంది ఆవిడ. పాపం! మరి అమ్మా నాన్నా లేక పోతే పొద్దున్నే ముద్దుగా ఎవరు లేపుతారు? ఎవరు పాలు ఇస్తారు?

జాలిగా, "నిన్నెవరు పెంచారు?" అంది. ఆవిడ "ఎవరూ పెంచలేదు. నేనే పెరిగాను అక్కడా అక్కడా అడుక్కుని" ఈ సమాధానాలన్నీ ఆవిడ శాస్త్రనిర్లిప్తంగా కాస్త విసుగ్గా చెబుతోంది. ఆవిడ మళ్ళా చెప్పింది. "ఒక అత్త ఉండేది కొన్నాళ్ళకి ఆవిడా పోయింది. పెళ్ళి చేసుకున్నాను. వాడొట్టి మొరటువాడు వదిలేశాడు. ఒక పాప వుండేది దానికి పాలు చాల్లేదు. జబ్బుచేసింది మందూ లేదు, అదీ పోయింది. ఇప్పుడు నేను ఉన్నాను. విరిగిపోయిన మట్టిగోడలు ఉన్నాయి. అంతే!" ఇవన్నీ ఆవిడ నిర్లిప్తంగా చెపుతోంది.

ఆవిడ మాట్లాడుతూ ఉంటే ఏదో బండ రాయి మాట్లాడినట్లుంది. కంట తడిలేదు. ముఖంలో మార్పులేదు. పాపకు సిగ్గువేసింది. ఇల్లు లేదు, వాకిలి లేదు, తినటానికి తిండిలేదు. కాని ఆవిడ కంట తడిలేదు. నిర్లిప్తంగా ఉంది. తను? కాస్త చిన్న విషయానికి ఏడుస్తోంది కబుర్లు చెప్పుకోవటానికి రంగారావు రాలేదు. ఏం కారణమో ఏమో! తను అంత లోకే కోపంవచ్చి ఏడుస్తోంది ఇంత చిన్న విషయానికి తను తట్టుకోలేదు. మరి ఆమె? ఎన్ని బాధలు ఉన్నా నిర్లిప్తంగా ఉంది. కళ్ళల్లో నీళ్ల ఇంకి పోయాయేమో! మనస్సు మొద్దుబారిందేమో! ఎప్పుడో తెలుగు మాస్టారు చెప్పారు. నిండా మునిగిన వాడికి చలిలేదని అంటే ఇదేనేమో!

పాపకు ఆవిడ మీద జాలివేసింది. ఆవిడతో స్నేహం చెయ్యాలని పించింది. ఆవిడను ఆదుకోవాలనిపించింది. తన బాధ మరచిపోయింది. కళ్ళు తుడుచుకుంది ఆవిడతో అంది. "నాతో వస్తావా? మా ఇంట్లో వుందువుగాని, మా అమ్మతో చెప్పుతాను" అంది

ఆవిడ ముఖంలో మొదటిసారిగా కాస్త కదలిక కనిపించింది. కళ్లు పెద్దవి చేసి చూసింది మళ్ళా కాస్త వ్యంగంగా నవ్వింది "నన్ను ఎవరూ ఇంట్లో ఉంచుకోరు. మీ అమ్మగారూ అంతే. నేను దొంగనేమో

నవి భయపడతారు. ఇంట్లోచేరి ఏమైనా ఎత్తుకు పోతానేమో అనుకుంటారు. అందుకే ఎవరిని పని అడగడం కూడా మానేశాను." అంది. పాప ఊరుకో లేదు. మళ్ళా అంది. "ఫరవాలేదు, మా అమ్మ నా మాట కాదనదు. నాకు నీమీద నమ్మకం ఉంది. మా ఇంట్లో చాలా మంది నౌకర్లున్నారు. నువ్వూ ఉండవచ్చు, రోజూ మనిద్దరం పార్కుకు రావచ్చు. మా టామీ నీకు నచ్చిందా ?" టామీని దగ్గరకు లాక్కుని ఆమె మీదకు తోసింది. ఆమె నవ్వుతూ టామీ తల నిమిరింది. టామీకి కూడా ఆవిడ నచ్చినట్లుంది. తోంగ కారుస్తూ ఆప్యాయంగా ఆవిడకేసి చూస్తోంది. "చీకటి పడుతోంది రా పోదాం" అంది పాప. ఆవిడ మళ్ళా సందేహంగా చూసింది. పాప ఆవిడ చెయ్యి పట్టుకు లాగింది. ఆవిడ చినిగిన చీర సర్దుకుంది. పాప ముందు నడిచింది. ఆవిడ టామీతో నడిచింది.

తోవలో రంగారావు ఎదురు పడ్డాడు. దిగులుగా పాపకేసి చూశాడు. భయపడుతూ చెప్పాడు. "మా అమ్మకి ఒంట్లో బాగుండలేదు జ్వరం వచ్చింది. హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాను. అందుకే...." సందేహంగా నీళ్ళు నమిలాడు. పాప నవ్వింది. "ఫరవాలేదులే, నాకొక కొత్త స్నేహితురాలు దొరికింది చూడు !" అంటూ ప్రక్కనున్న ఆవిడను చూపించింది. రంగారావు తెల్లబోయి ఆవిడకేసి చూస్తూ ఉండిపోయాడు. పాప మళ్ళా అంది "రేపు నేను వచ్చి మీ అమ్మను చూస్తానులే, నువ్వెళ్ళు" అంది. రంగారావు వెళ్ళిపోయాడు.

పాప ఇప్పుడు పాపకాదు. ఎదిగింది. పెద్దదయింది.